ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 7



తమిళనాడు TAMILNADU

బుధవారం 9 అక్టోబరు 2024

నేత్రపర్వంగా గరుడ సేవ

భక్తుల కర్పూర నీరాజనాలు



గరుడ వాహనంపై శ్రీహరి చిద్విలాసం



ఆలయం వద్ద భక్తులు



ప్యారీస్, అక్టోబరు 8: స్థానిక టి.నగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన మంగళవారం సాయంత్రం 7.45 గంటలకు సర్వాంగ సుందరుడైన శ్రీవారు గరుడ వాహనంపై మాడవీధుల్లో విహరించారు. ఆలయంలో పూజల అనంతరం శ్రీవారిని వాహన మండపానికి వేంచేపు చేసి గరుత్మంతుడి వాహనంలో అధిష్ఠింపజేశారు. వేదపండితుల మంత్రోచ్చరణ, మంగళవాయిద్యాలు, కళాకారుల నృత్య ప్రదర్శన, భక్తుల గోవింద నామస్మరణతో ప్రారంభమైన ఊరేగింపు రాత్రి 9.30 గంటల వరకు జరిగింది. షష్టి ముహూర్తంలో ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో టీటీడీ చెన్నై పాలక మండలి మాజీ అధ్యక్షులు ఏజే శేఖర్, నూతలపాటి శ్రీకృష్ణ, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డా.ఎస్.శంకర్, మండలి మాజీ సభ్యులు బి.మోహనరావు, వీపీఆర్ కృష్ణారావు, ఊరా లక్ష్మీ నరసింహరావు, ఎస్.కార్తికేయన్, ఎల్.సుధాకర్‌రెడ్డి, మన్నం రవిబాబు తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఏఈవో కె.పార్థసారధి సారథ్యంలో శ్రీవారికి ఆస్థాన పూజలను నిర్వహించారు. గరుడ సేవను పురస్కరించుకొని ఆలయం, ప్రాంగణం, మాడవీధులను సుందరంగా అలంకరించారు.

ఉద్యోగాల కల్పనే ధ్యేయం

రూ.38,698 కోట్లతో 14 కొత్త పరిశ్రమలు

క్యాబినెట్ ఆమోదం

47వేల మందికి ఉపాధి



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.38,698 కోట్ల పెట్టుబడులతో కొత్తగా 14 పరిశ్రమలు నెలకొల్పేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సచివాలయంలో మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. రాష్ట్రంలో కొత్తగా నెలకొల్పనున్న 14 కొత్త కర్మాగారాలకు ప్రభుత్వం ఏకగవాక్ష పద్ధతిలో అన్ని సదుపాయాలు, రాయితీలు కల్పించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాలు, వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మారుమూల గ్రామాల ప్రజలకు కూడా అందేలా తీసుకోవాల్సిన చర్యలు గురించి సమగ్రంగా చర్చించారు. శ్రీపెరుంబుదూరు సుంకువారి సత్రం వద్ద నున్న మొబైల్ కర్మాగారం కార్మికుల సమ్మె విరమింపజేసే విషయం గురించి కూడామంత్రి వర్గ సహచరులతో ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, పొన్ముడి, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, సామినాథన్, తంగం తెన్నరసు, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, ఐ పెరియసామి, కేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ఈవీ వేలు, టీఆర్‌బీ రాజా, అనితా రాధాకృష్ణన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎన్. మురుగానందం పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం మంత్రులు తంగం తెన్నరసు, టీఆర్‌బీ రాజా సచివాలయం వెలుపల మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్, హరిత హైడ్రోజన్, హరిత అమ్మోనియా తదితర రంగాలకు సంబంధించి రూ.38698 కోట్ల పెట్టుబడులతో 14 కొత్త పరిశ్రమలు నెలకొల్పేందుకు మంత్రి వర్గం ఆమోదించిందని తెలిపారు. ఈ పరిశ్రమల ద్వారా సుమారు 47 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రాణిపేటలో టాటా మోటార్స్ ఏర్పాటు చేయనున్న కర్మాగారంలో స్థానికులు ఐదువేల మందికి ఉపాధి కల్పించనున్నారని తెలిపారు. మంత్రి టీఆర్‌బీ రాజా మాట్లాడుతూ... సుంకువారి సత్రం మొబైల్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై ఏడుసార్లు లేబర్ కమిషన్ అధికారులు చర్చలు జరిపారని, ముఖ్యమంత్రి ఆదేశం మేరకు తనతోపాటు ముగ్గురు మంత్రులు కార్మికులు, కర్మాగారం యాజమాన్య ప్రతినిధులతో 10 గంటలకు పైగా చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు ఇన్‌చార్జి మంత్రులు

- కోవైకు సెంథిల్ బాలాజీ

అడయార్, అక్టోబరు 8: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేసేలా పర్యవేక్షించడం కోసం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జిల్లాల వారీగా ఇన్‌చార్జ్ మంత్రులను నియమించారు. ఇందులో భాగంగా కోయంబత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా సెంథిల్ బాలాజీని నియమించారు. ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రుల వివరాలిలా... నెల్లైకు కేఎన్ నెహ్రూ, తేనికి పెరియస్వామి, కళ్ళకుర్చికి ఏవీ వేలు, ధర్మపురికి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, తెన్‌కాశికి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, కన్నియాకుమారికి తంగం తెన్నరసు, నీలగిరికి స్వామినాథన్, కృష్ణగిరికి చక్రపాణి, కాంచీపురంకు గాంధీ, పెరంబలూరుకు శివశంకర్, నాగపట్టణంకు అన్బిల్ మహేశ్, మైలాడుదురైకు మెయ్యనాథన్‌ను నియమించారు.

15న వెయ్యిచోట్ల వైద్యశిబిరాలు

మంత్రి ఎం.సుబ్రమణ్యం



ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

పెరంబూర్, అక్టోబరు 8: రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి ప్రాంతాల్లో ఈ నెల 15వ తేదీ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం వెల్లడించారు. సైదాపేట లేబర్ కాలనీలో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఈశాన్య రుతుపవనాలను ఎదుర్కొనేందుకు ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందని, ప్రస్తుతం జ్వరాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో 100 ప్రాంతాలు, ఇతర జిల్లాల్లో 900 ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించనున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన 'మక్కల్ తేడి మరుత్తువ ముగాం' పథకంలో కోటి మంది లబ్ధిపొందేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించగా, ఇప్పటి వరకు 2 కోట్ల మంది లబ్ధిపొందారని, ఈ పథకాన్ని ఐక్యరాజ్య సమితి కూడా ప్రశంసించిందని తెలిపారు. డెంగ్యూ వ్యాప్తి నియంత్రణకు ప్రజల సహకారం అవసరమన్నారు. గత మూడేళ్లుగా డెంగ్యూ మృతుల సంఖ్య క్రమంగా తగ్గుతోందని, ఈ ఏడాది ఇప్పటి వరకే ఏడుగురు మాత్రమే మృతిచెందారన్నారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.





చెన్నై మెరీనా బీచ్‌లో రూ.137 కోట్లతో మరమ్మతు చేసిన స్విమ్మింగ్‌పూల్‌ను మంగళవారం ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

దేశంలో స్టార్టప్‌ల విప్లవం ఆరంభం

- డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి
- వీఐటీలో 'గ్లోబల్ లీడర్‌షిప్ సమ్మిట్-2024'



సతీష్‌రెడ్డిని సత్కరిస్తున్న వీఐటీ నిర్వాహకులు

అడయార్, అక్టోబరు 8: దేశంలో స్టార్టప్‌ల విప్లవం ప్రారంభమైందని, యువత తమ ప్రతిభకు సానబట్టి అవకాశాలను అందింపుచ్చుకోవాలని డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ)లో 'ది టెక్ లీడ్ - గ్లోబల్ లీడర్‌షిప్ సమ్మిట్-2024' (టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ టువార్డ్స్ 2035 - గ్లోబల్ పర్‌స్పెక్టివ్) మంగళవారం జరిగింది. ఈ సదస్సుకు డీఆర్‌డీవో ఛైర్మన్, భారత రక్షణ శాఖకు సైంటిఫిక్ అడ్వైజర్, ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా, గౌరవ అతిథిగా బెంగళూరుకు చెందిన ఇన్ఫోసిస్ టెక్ నిపుణుడు సుందరేశన్ పూవలింగంతో పాటు వీఐటీ ఛాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ వీఎస్ కాంచన భాస్కరన్, ప్రొ-వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి.త్యాగరాజన్, అడిషినల్ రిజిస్ట్రార్ డాక్టర్ వీకే మనోహరన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సును ప్రారంభించిన డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ, సాంకేతిక, ఉన్నత విద్య, నాయకత్వం, గ్లోబల్ మేనేజ్‌మెంట్ పద్ధతులలో భవిష్యత్ పోకడలపై చర్చించేందుకు 15 దేశాల నుంచి 32 మంది ప్రముఖులు ఒకచోట చేరడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్య అతిథి డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ- ప్రపంచ యుద్ధంలో తీవ్రంగా నష్టపోయిన జపాన్‌తో పాటు ఇజ్రాయిల్ సహా అనేక దేశాలు శాస్త్ర సాంకేతికపరంగా అభివృద్ధి చెందాయన్నారు. భారత్ విషయానికి వస్తే, ప్రారంభదశలో సాంకేతికతపై వచ్చే సమాచారాన్ని అంగీకరించరని, అది సక్సెస్ అయితేనే స్వాగతిస్తారని గుర్తు చేశారు. ప్రస్తుతం యువతకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, యువత తమ ప్రతిభను వినియోగించుకోవాలన్నారు. దేశంలో స్టార్టప్‌ల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతున్నాయని, 2014లో 468 స్టార్టప్‌లు ఉండగా, 2024లో వాటి సంఖ్య 1.50 లక్షలకు చేరిందన్నారు. దేశంలో పరిశోధనా కోర్సులు అభ్యసించే వారి సంఖ్య పెరిగిందని ఫలితంగా ప్రపంచంలో మూడో అతిపెద్ద దేశంగా భారత్ ఆవిర్భవించిందన్నారు. 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ళు పూర్తికానున్నాయని, అప్పటికి మన దేశం ప్రపంచానికే నాయకత్వం వహించే స్థాయికి చేరుకుంటుందన్నారు.

ఆస్తి పన్ను పెంపును ఉపసంహరించుకోండి

శాంతిభద్రతలను కాపాడండి ● అన్నాడీఎంకే డిమాండ్

● రాష్ట్రవ్యాప్తంగా మానవహారాలు ● గ్రేటర్‌లో నిరసనలు



కాంచీపురం గాంధీ వీధిలో మానవహారం

ప్యారీస్, అక్టోబరు 8: రాష్ట్రంలో ఆస్తి పన్ను పెంపు, విద్యుత్, రిజిస్ట్రేషన్ చార్జీలు, తాగునీరు, మురుగునీరు తొలగింపు చార్జీల పెంపును ఖండిస్తూ ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా మానవహారం పేరుతో చేపట్టిన నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కేంద్రాల్లో అన్నాడీఎంకే కార్యదర్శులు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేల అధ్యక్షతన మానవహారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాగింది. ఆందోళనకారులు మూడున్నరేళ్ల డీఎంకే పాలనా వైఖరి ఖండిస్తూ నినాదాలతో హోరెత్తించారు. రాజధాని నగరంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 200 వార్డుల్లో ఆందోళన చేపట్టారు. రాయపురం నియోజకవర్గం వాషర్‌మెన్‌పేటలో మాజీ మంత్రి డి.జయకుమార్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి పచ్చైమాన్, మాజీ కౌన్సిలర్ రాయపురం మనో తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా విల్లివాక్కం, కొళత్తూర్, అన్నానగర్, తండయార్‌పేట, వేళచ్చేరి సహా 200 వార్డుల్లో డీఎంకే వైఖరి తప్పుపడుతూ ప్లకార్డులతో నిరసన ప్రదర్శనలు చేశారు. నగర శివారు ప్రాంతాలైన తాంబరం, చిట్లపాక్కం, తిరువొత్తియూర్, రెడ్‌హిల్స్, పుళల్, అంబత్తూర్, ఆవడి తదితర ప్రాంతాల్లోనూ అన్నాడీఎంకే శ్రేణులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కడలూరు జిల్లా చిదంబరంలో ఎమ్మెల్యే పాండ్యన్, కాంచీపురం గాంధీ వీధి, కడలూరులో మాజీ మంత్రి ఎంసీ సంపత్ నేతృత్వంలో వేలూరు, తిరుచ్చి, మదురై, సేలం, కోయంబత్తూర్, ఈరోడ్, కన్నియాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి, విరుదునగర్ జిల్లాల్లో కూడా మానవహారం నిర్వహించారు. రాయపురం నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి జయకుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో మూడున్నరేళ్ల పాలనలో ఇంటి పన్ను పెంచడంతో పాటు నిత్యావసర సరుకుల ధరలు కూడా విపరీతంగా పెంచారని, పన్నులు సక్రమంగా చెల్లిస్తున్న ప్రజలపై పన్నుల రూపంలో మరింత ఆర్థికభారం మోపారని ఆరోపించారు.



చిదంబరంలో ఎమ్మెల్యే పాండ్యన్ నేతృత్వంలో నిరసన

జాలర్లపై దాడులను ఖండిస్తూ పీఎంకే నిరసన

శ్రీలంక రాయబార కార్యాలయ ముట్టడి యత్నం



వళ్లువర్‌కోట్టమ్ వద్ద ధర్నా చేస్తున్న పీఎంకే నేతలు, కార్యకర్తలు

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం జరుపుతున్న దాడులను అరికట్టాలని, ప్రస్తుతం శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లను విడిపించాలని, జాలర్ల సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ నగరంలో పీఎంకే ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. ఆ సందర్భంగా శ్రీలంక రాయబార కార్యాలయాన్ని ముట్టడించేందుకు కార్యకర్తలంతా ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. వళ్లువర్‌కోట్టమ్ వద్ద మంగళవారం ఉదయం సుమారు వెయ్యిమందికి పైగా పీఎంకే కార్యకర్తలు, జాలర్ల కుటుంబీకులు, మహిళలు గుమికూడారు. పీఎంకేకు చెందిన కేంద్ర మాజీ మంత్రి ఏకే మూర్తి, కోశాధికారి తిలకభామా నాయకత్వంలో శ్రీలంక ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలంతా పెద్దపెట్టున నినాదాలు చేశారు. శ్రీలంక రాయబార కార్యాలయం వరకు నిరసన ర్యాలీ జరిపారు. రాయబార కార్యాలయంలో వినతి పత్రం సమర్పించేందుకు ఐదుగురిని మాత్రమే అనుమతించారు. ఆ మేరకు పార్టీ నాయకులు శ్రీలంక రాయబార కార్యాలయ ఉన్నతాధికారులకు వినతి పత్రం సమర్పించారు.

సమూచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 8: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా మనలి పరిధిలోని గంగైఅమ్మన్ నగర్, కలైంజర్ నగర్, సీపీసీఎల్ నగర్, పాడశాలై రోడ్డు కొంత భాగం, వైయక్కాడు, 200 అడుగుల రోడ్డు మనలి, సడయాన్‌కుప్పం, బర్మా నగర్, ఇరుళర్ కాలని, ఎలందనూర్, పొన్నేరి హైరోడ్డు, రాజీవ్ గాంధీ నగర్, ఎంఎండీఏ ఫేస్ 1,2, ద్వారకా నగర్, అండార్ కుప్ప చెక్‌పోస్ట్, ఏసీసీ మెయిన్ రోడ్డు, జేఆర్ మెటల్ అండ్ ఇండో టెక్, మెట్రోవాటర్ అండ్ ఐనాక్స్ సాత్తాంగాడు స్టీల్ యార్డు, కొఠారి ప్లాంట్, రాజాజీ నగర్, కార్గిల్ నగర్, రామస్వామి నగర్, సదయమూర్తి నగర్, వీపీ నగర్, పచ్చయప్ప గార్డన్, చిన్న మాతూర్ రోడ్డు, అంబేడ్కర్ వీధి, చందనకృష్ణ రోడ్డు, పుటుర, పద్మగిరి ఫేస్ 1,2 ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

సహకార దుకాణాల్లో కిలో ఉల్లి రూ.40

పెరంబూర్, అక్టోబరు 8: బహిరంగ మార్కెట్లో ఉల్లి ధరలు పెరగడంతో, సహకార శాఖ దుకాణాల ద్వారా మంగళవారం నుంచి కిలో ఉల్లి రూ.40కి విక్రయిస్తున్నారు. పొరుగు రాష్ట్రాల్లో వర్షాల కారణంగా ఉల్లి దిగుబడి తగ్గడంతో స్థానిక కోయంబేడు మార్కెట్‌కు తక్కువ సంఖ్యలోనే ఉల్లి లోడుతో లారీలు వస్తున్నారు. మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.80 నుంచి రూ.90 వరకు విక్రయమవుతుండగా, చిల్లర మార్కెట్లో రూ.100 నుంచి రూ.110 వరకు ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో, సహకార శాఖ దుకాణాల ద్వారా కిలో ఉల్లి రూ.40కి అందించాలని నిర్ణయించారు. ఆ ప్రకారం తేనాంపేట, మైలాపూర్, ట్రిప్లికేన్, అన్నానగర్ ప్రాంతాల్లో పనిచేస్తున్న గ్రీన్ ఫాం దుకాణాల్లో కిలో ఉల్లి రూ.40కి విక్రయిస్తున్నట్లు, ఒకరికి 2 కిలోల మాత్రమే అందిస్తున్నామని అధికారులు తెలిపారు.

తాంబరం-కోవై మధ్య ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, అక్టోబరు 8: విజయ దశమి, దీపావళి పండుగల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం-కోయంబత్తూర్-తాంబరం మధ్య వారాంతపు ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. నెం.06184 తాంబరం-కోయంబత్తూర్ ఫెస్టివల్ స్పెషల్ ఈ నెల 11,18, 25 నవంబరు 1,8,15,22,29 (శుక్రవారం) తేదీల్లో తాంబరంలో సాయంత్రం 6 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.10 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06185 కోయంబత్తూర్-తాంబరం ఫెస్టివల్ స్పెషల్ ఈ నెల 13,20,27, నవంబరు 3,10,17,24, డిసెంబరు 1వ తేదీల్లో (ఆదివారం) కోయంబత్తూర్‌లో రాత్రి 11.45 బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలియజేసింది.

గోవా, పూనేలకు విమాన సేవలు

పెరంబూర్, అక్టోబరు 8: నగరం నుంచి గోవా, పూనేలకు నేరుగా విమాన సేవలు నడుపనున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రకటించింది. ఈ సేవలు నవంబరు 1వ తేది నుంచి అందుబాటులోకి రానున్నాయి. నగరం నుంచి ప్రతిరోజు సాయంత్రం 4.10 గంటలకు బయల్దేరే విమానం 5.45 గంటలకు గోవా చేరుకుంటుంది. మరుమార్గంలో గోవాలో సాయంత్రం 6.15 బయల్దేరి రాత్రి 7.55 గంటలకు నగరానికి చేరుకుంటుంది. అలాగే, నగరం నుంచి రాత్రి 8.50 గంటలకు బయల్దేరే విమానం 10.30కి పూనే చేరుకుంటుంది. మరుమార్గంలో పూనేలో రాత్రి 11.15 బయల్దేరి అర్థరాత్రి 12.55 గంటలకు నగరం చేరుకుంటుంది.

వినేష్ ఫోగట్‌కు డిప్యూటీ సీఎం శుభాకాంక్షలు

ఐసిఎఫ్, అక్టోబరు 8: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన వినేష్ ఫోగట్‌ను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అభినందించారు. ఝులానా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన వినేష్ ఫోగట్ విజయం సాధించారు. ఆమె విజయంపై ఉప ముఖ్యమంత్రి తన ఎక్స్ పేజీలో... ప్రజా ప్రతినిధిగా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన వినేష్ ఫోగట్‌కు అభినందనలు. ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడే శక్తితో ముందుకు సాగాలంటూ డిప్యూటీ సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

15లోగా 'ఎమిస్'లో త్రైమాసిక పరీక్షల మార్కులు

ఐసిఎఫ్, అక్టోబరు 8: పాఠశాల విద్యార్థుల త్రైమాసిక పరీక్షల మార్కులు 'ఎమిస్' వెబ్‌సైట్‌లో ఈ నెల 15వ తేదిలోగా అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఎస్.కన్నప్పన్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో త్రైమాసిక, మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 6 నుంచి 8వ తరగతులు విద్యార్థులు సాధించిన మార్కులను ఉపాధ్యాయులు ఎమిస్ వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మార్కుల అప్‌లోడ్ ప్రక్రియను పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎబిలిటీ అవార్డుల కోసం దరఖాస్తులాహ్వానం

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రతిభావంతులైన సాధకుల కోసం 'కెవిన్‌కేర్ ఎబిలిటీ అవార్డ్స్-2025'కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. దివ్యాంగులు సాధించిన స్థితిస్థాపకత, విజయాలకు గుర్తింపుగా ప్రతియేడాది కెవిన్‌కేర్-ఎబిలిటీ ఫౌండేషన్ సంయుక్తంగా 22 ఏళ్లుగా అవార్డులు ప్రదానం చేస్తున్న తెలిసిందే. దేశవ్యాప్తంగా ఎంపిక చేయబడిన సాధకులకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు రెండు విభాగాల్లో అసాధారణమైన వైకల్యాలున్న వ్యక్తులను సత్కరిస్తూ 'ది కెవిన్‌కేర్ ఎబిలిటీ అవార్డ్ ఫర్ ఎమినెన్స్ 'ది కెవిన్‌కేర్ ఎబిలిటీ మాస్టరీ అవార్డ్'లను బహూకరిస్తోంది. ఈ నేపథ్యంలో 2025 ఏడాదికి గాను నిర్వాహకులు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఔత్సాహికులు నవంబరు 8వ తేదీ లోపు www. ability-foundation.org, www.cavin kare. com వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఆయుధపూజ సందర్భంగా ప్రత్యేక సంత

ప్యారీస్, అక్టోబరు 8: ఆయుధపూజను పురస్కరించుకొని కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్ ప్రాంగణంలో సోమవారం ప్రారంభించిన ప్రత్యేక సంత ఈ నెల 13వ తేది వరకు ఉంటుంది. ఈ సంతలో పూజకు అవసరమైన బొరుగులు, టెంకాయలు, అరిటాకులు, పసుపు కొమ్ములు, గుమ్మడికాయ, పసుపు, కుంకుమ, తోరణాలు, అలంకరణ సామగ్రి అందుబాటులో ఉంటాయి. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు అనుకూలంగా ఈ ప్రత్యేక సంత ఏర్పాటుచేశారు. ప్రజలు రద్దీలో చిక్కుకోకుండా ట్రాఫిక్ విభాగం పోలీసులు విధుల్లో పాల్గొంటున్నారు. అదే విధంగా లా అండ్ ఆర్డర్ పోలీసులు కూడా నేరస్తులను పసిగట్టే పనుల్లో పాల్గొంటున్నారు.

దీపావళికి ముందే వ్యవసాయ రుణమాఫీ

● పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి



ప్రారంభోత్సవంలో లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్ నాథన్, సీఎం రంగస్వామి తదితరులు

పుదుచ్చేరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు పొందిన రుణా రూ.13 కోట్లుగా ఉన్నాయని, వాటిలో తొలివిడతగా రూ.12 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ చేసేలా చర్యలు చేపట్టినట్లు పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి తెలిపారు. ఊసుడు నియోజకవర్గ పరిధిలోని తొండమనాథం గ్రామంలో రూ.2.55 కోట్లతో 5 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను మంగళవారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి నేతృత్వంలో లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్‌ను ఆ వాటర్ ట్యాంక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... ఈ తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి 2015లో శంకుస్థాపన జరిగిందని, మళ్లీ నేను ముఖ్యమంత్రిగా ఈ ట్యాంక్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రైతులకు దీపావళి బహుమతిగా వ్యవసాయ రుణమాఫీ ప్రకటన ఉంటుందన్నారు. అలాగే, దీపావళికి ముందుగానే రేషన్ దుకాణాలు ప్రారంభించి ఉచిత బియ్యం అందించనున్నామన్నారు. దీపావళి సందర్భంగా 10 కిలోల బియ్యం, 2 కిలోల చక్కెర రేషన్ దుకాణాల ద్వారా పొందేలా చర్యలు చేపట్టినట్లు సీఎం రంగస్వామి తెలిపారు.

పెరిగిన ఆవిన్ ఐస్‌క్రీమ్ ధరలు

పెరంబూర్, అక్టోబరు 8: ఆవిన్ ఐస్‌క్రీమ్ రకాల ధరలను ఆవిన్ సంస్థ పెంచింది. రాష్ట్రప్రభుత్వ సహకార పాల సంస్థ ఆవిన్ 100కు పైగా రకాల ఐస్‌క్రీమ్‌లు తయారుచేసి విక్రయిస్తోంది. ఈ నేపథ్యంలో, ఆవిన్ ఐస్‌క్రీమ్ ధరలు పెంచుతున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఈ పెంపు ఈ నెల 1వ తేది నుంచి అమలుకు వచ్చిందని ఉత్తర్వుల్లో పేర్కొంది. 1,000 మి.లీ వెనీలా, మ్యాంగో, బట్టర్ స్కాచ్ రూ.150 నుంచి రూ.220, చాక్లెట్ రూ.170 నుంచి రూ.250, పిస్తా రూ.175 నుంచి రూ.250, బాదం, బట్టర్ స్కాచ్ రూ.180 నుంచి రూ.250కి పెంచారు. కాగా, పాల కొనుగోలు ధరలు పెంచకుండా ఐస్‌క్రీమ్ ధరలు పెంచడాన్ని ఖండిస్తున్నట్లు తమిళనాడు పాల ఉత్పత్తి దారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొన్నుస్వామి తెలిపారు. సహజంగా పాల కొనుగోలు ధరలు పెంచిన సమయంలో పాలు, ఇతర ఉత్పత్తుల ధరలు పెంచుతారన్నారు. అదే సమయంలో వివాహాలు, పుట్టిన రోజు వంటి శుభకార్యాల్లో వినియోగించే 4,500 మి.లీ బల్క్ ఐస్‌క్రీమ్ రకాలపై రూ.80 నుంచి రూ.100 వరకు ధర తగ్గించడాన్ని ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఏర్కాడులో కుండపోత

● జలపాతాల్లో పర్యాటకుల స్నానాలు



జలపాతం వద్ద స్నానం చేస్తున్న పర్యాటకులు

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో నిరుపేదల ఊటీగా పేరొందిన ఏర్కాడులో కుండపోతగా వర్షాలు కురిశాయి. గత వారం రోజులు ఆ ప్రాంతంలో ఎండలు విపరీతంగా కాయడంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలపాలయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఇక్కడ ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై భారీగా వర్షాలు కురిశాయి. దీంతో ఏర్కాడు అంతటా వాతావరణం చల్లబడింది. అటు పిమ్మట రాత్రి తొమ్మిది గంటలకు, మంగళవారం వేకువజామున భారీగా వర్షాలు కురిశాయి. అదే సమయంలో అక్కడి జలపాతాలన్నీ జలకళను సంతరించుకున్నాయి. వాటితో పాటు కొండ ప్రాంతాల్లో తాత్కాలిక జలపాతాలు ఏర్పడ్డాయి. దీనితో పర్యాటకులు ఆ జలపాతాల వద్ద స్నానం చేయడానికి పోటీపడ్డారు.

అనుమతి లేని విడిదిగృహాలపై చర్యలు

పెరంబూర్, అక్టోబరు 8: నగరంలో అనుమతి లేకుండా పనిచేసే ప్రైవేటు విడిదిగృహాలపై చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు చెన్నై జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. అనుమతి లేకుండా విడిది గృహాలు నిర్వహిస్తే రెండేళ్ల జైలు, రూ.50,000 జరిమానా విధిస్తామన్నారు. యజమానులు తగిన పత్రాలతో నవంబరు 15వ తేది సాయంత్రం 5 గంటల్లోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని కలెక్టర్ తెలిపారు.

ఉపాధ్యాయుల నియామకాలపై స్టే పొడిగింపు

పెరంబూర్, అక్టోబరు 8: పాఠశాల విద్యాశాఖలో గ్రాడ్యుయేట్ టీచర్ల నియామకంపై విధించిన స్టేను మద్రాసు హైకోర్టు పొడిగించింది. ప్రభుత్వ జీవో ప్రకారం 2 శాతం కేటాయింపులు జరుగలేదని భరణి సహా వంద మందికి పైగా హైకోర్టులో పిటిషన్లు వేశారు. మంత్రిత్వ శాఖ సిబ్బందికి పదోన్నతి లేకుండా గ్రాడ్యుయేట్ టీచర్ల నియామకంపై హైకోర్టు మధ్యంతర స్టే విధించింది.

ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీని ప్రారంభించిన దళవాయి సుందరం

● పార్టీ పదవుల నుంచి తొలగించిన ఈపీఎస్



కుమరిలో ర్యాలీని ప్రారంభిస్తున్న దళవాయి సుందరం

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన మాజీ మంత్రి, అన్నాడీఎంకే ఎమ్మెల్యే దళవాయిసుందరంపై వేటు పడింది. పార్టీ పదవుల నుంచి తొలగిస్తున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. ఈ నెల 6న విజయదశమి సందర్భంగా కన్నియాకుమారిలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని దళవాయి సుందరం ప్రారంభించారు. దీంతో అయన బీజేపీలో చేరనున్నట్లు ఊహాగానాలు చెలరేగాయి. ఆయనపై బహిష్కరణ వేటు తప్పదని అందరూ భావించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఈపీఎస్ విడుదల చేసిన ప్రకటనలో పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించిన దళవాయి సుందరాన్ని పార్టీ పదవుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ నిబంధనలు ఉల్లఘించారా లేదా అనే విషయమై సమగ్రమైన విచారణ జరిపిన మీదట దళవాయి సుందరంపై తదుపరి చర్యలు తీసుకుంటామని కూడా ఈపీఎస్ పేర్కొన్నారు.

ఎమ్మెల్యే హోదాలో ర్యాలీ ప్రారంభించా...

పార్టీ పదవులను కోల్పోయిన మాజీ మంత్రి దళవాయి సుందరం మాట్లాడుతూ కన్నియాకుమారిలో ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీని స్థానిక ఎమ్మెల్యే హోదాలో ప్రారంభించానని, ఇందులో పార్టీ నిబంధనల ఉలంఘన లేదని స్పష్టం చేశారు. ర్యాలీని ప్రారంభించడం వెనుక తనకు ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. పార్టీ పదవుల నుండి తొలగిస్తే ఎలాంటి బాధ లేదన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీని ప్రారంభిస్తే అన్నాడీఎంకే బలం తగ్గిపోతుందని భావించి ఈపీఎస్ తనపై ఈ చర్య తీసుకున్నారని ఆయన యెద్దేవా చేశారు.

పులి చర్మం విక్రయించిన ముగ్గురి అరెస్ట్



పులి చర్మంతో పట్టుబడిన నిందితులు

పెరంబూర్, అక్టోబరు 8: సేలం జిల్లా తలైవాసల్ సమీపం ముమ్మడిలో ఉన్న లాడ్జిలో బసచేస్తూ పులి చర్మం విక్రయించేందుకు యత్నించిన ముగ్గురిని అటవీ శాఖ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అటవీ శాఖ అధికారులకు అందిన సమాచారంతో ఈ లాడ్జిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఓ గదిలో మణివిళందాన్ గ్రామానికి చెందిన పెరియపిళ్లై, రాబిన్ కుమార్, మణి తదితరులను అరెస్ట్ చేసిన అధికారులు, వారి నుంచి పులి చర్మం స్వాధీనం చేసుకున్నారు.

రాజకీయాల్లో శాశ్వత శత్రువులుండరు...!

● బీజేపీతో మైత్రిపై మాజీ మంత్రి దిండుగల్ శ్రీనివాసన్

పెరంబూర్, అక్టోబరు 8: రాజకీయాల్లో శాశ్వత శత్రువులుండరని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి దిండుగల్ శ్రీనివాసన్ తెలిపారు. మదురైలో అన్నాడీఎంకే నిర్వాహకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దిండుగల్ శ్రీనివాసన్ మాట్లాడుతూ... కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల పరిరక్షణలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందన్నారు. రకరకాల రంగుల రైళ్లు నడుపుతూ ప్రజల సొమ్ము దోచుకొనేలా కేంద్ర ప్రభుత్వ పాలన ఉందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 200లకు పైగా స్థానాల్లో అన్నాడీఎంకే విజయం సాధించి, ఎడప్పాడి పళనిస్వామి ముఖ్యమంత్రి పదవి చేపట్టడాన్ని ఏ శక్తి అడ్డుకోలేదన్నారు. ఈ క్రమంలో, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో కూటమి ఉంటుందా అన్న విలేఖరుల ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ... రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని, ఎన్నికలకు ఇంకా కొన్ని నెలలు ఉందని, ఆ సమయంలో ఏమైనా జరుగవచ్చని సమాధానమిచ్చారు.

టీవీకే మహానాడుకు భారీ ఏర్పాట్లు



మహానాడు వేదిక నిర్మాణ పనులు చేపడుతున్న కార్మికులు

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండిలో సినీ నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం తొలి మహానాడుకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. విక్రవాండి సమీపం విసాలై అనే ప్రాంతంలోని సుమారు వందెకరాల ప్రదేశంలో ఈ మహానాడు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ మహానాడుకు భారీ పందిరి వేస్తున్నారు. మహానాడు ప్రధాన వేదిక తూర్పుదిశగా, రైల్వే పట్టాలకు 200 మీటర్ల దూరంలో నిర్మిస్తున్నారు. వేదికపైనే పార్టీ అధ్యక్షుడు విజయ్ ఉండేందుకు ప్రత్యేక గది, వీఐపీలు బసచేయడానికి వేర్వేరు గదులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ మహానాడుకు వచ్చే కార్యకర్తలకు భారీ పందిరి చుట్టూ నలువైపులా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అల్పాహారం, భోజనాలను పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం వంటశాలల నిర్మాణం కూడా శరవేగంగా జరుగుతోంది.. కార్యకర్తలు, పార్టీ నాయకులు, ప్రముఖులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి కేటాయించిన ప్రాంతాల్లో వెళ్లేందుకు బారికేడ్లతో క్యూలైన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

వానొచ్చినా, వరదొచ్చినా కరెంట్ పోకూడదు

● అధికారులకు మంత్రి సెంథిల్‌బాలాజీ ఆదేశం



చెన్నై, కాంచీపురం జోన్ అధికారులతో సమావేశమైన విద్యుత్‌శాఖ మంత్రి సెంథిల్‌బాలాజీ

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోనూ, సమీప జిల్లాలోనూ ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాల కారణంగా వరద పరిస్థితులు ఏర్పడినా సాధ్యమైనంత వరకూ విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగకుండా అధికారులు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ మంత్రి సెంథిల్‌బాలాజీ ఆదేశాలిచ్చారు. అన్నాసాలైలో రాష్ట్ర విద్యుత్ బోర్డు ప్రధాన కార్యాలయంలో మంగళవారం వర్షాలు కురిసే సమయాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై చెన్నై, కాంచీపురం జోన్ విద్యుత్ బోర్డు అధికారుల సమావేశం జరిగింది. ఆ సమావేశంలో సెంథిల్‌బాలాజీ మాట్లాడుతూ వరదలు, తుఫాన్ల ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా ఇప్పటికే చెన్నై, కాంచీపురం విద్యుత్ జోన్‌లలో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తగా 5983 విద్యుత్ స్తంభాలను నాటినట్లు చెప్పారు. బలహీనంగా ఉన్న 12034 ఇన్సులేటర్లను, చెడిన 2040 ఫిల్లర్ బాక్స్‌లను కూడా మార్చామని తెలిపారు. విద్యుత్‌బోర్డు అధికారులు, సాంకేతిక ఇంజనీర్లు తమ వద్దనున్న వాకీటాకీలను వరద, వర్ష పరిస్థితుల్లో ఉపయోగించాలన్నారు. వర్షాలు, వరదలు సంభవిస్తే విద్యుత్ సమస్యలపై 9498794987 అనే నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అమెరికా మ్యూజియంలో సోమస్కందుడి విగ్రహం

అడయార్, అక్టోబరు 8: కాంచీపురం ఏకాంబరనాథ స్వామి ఆలయానికి చెందిన సోమస్కందుడి పంచలోహ విగ్రహం అమెరికా మ్యూజియంలో గుర్తించారు. ఈ విగ్రహం విలువ రూ.8 కోట్లు. తమిళనాడు రాష్ట్ర విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగం అధికారులు రాష్ట్రం నుంచి విదేశాలకు తరలించిన పంచలోహ విగ్రహాలను గుర్తించే పనిలో నిమగ్నమైవున్నారు. ఈ బృందం పోలీసులు... జరిపిన విచారణలో సోమస్కందర్ విగ్రహాన్ని అమెరికా దేశంలోని శాన్ ఫ్రాన్సిస్కో ఏషియన్ ఆర్ట్ మ్యూజియంలో గుర్తించారు. అంతర్జాతీయ స్మగ్లర్ల సహకారంతో ఈ విగ్రహాన్ని దేశ సరిహద్దులు దాటించినట్లు గుర్తించారు. దీంతో ఈ విగ్రహాన్ని తిరిగి రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. అదేసమయంలో ఆలయంలోని ఈ విగ్రమం ఎలా మాయమైందన్న విషయంపై ఏకాంబరనాథర్ ఆలయ అధికారుల వద్ద విచారణ జరుపుతున్నారు.

కత్తితో ఆస్పత్రికి వచ్చిన యువకుడు

● భయంతో పరుగులు తీసిన నర్సులు



కత్తిపట్టుకుని వస్తున్న శివపాండ్యన్

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా కారైక్కుడిలో ఆస్తి తగాదా కారణంగా తమ్ముడి చేతుల్లో కత్తిపోట్లకు గురైన అన్న గాయాలతోనే కత్తిపట్టుకుని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్ళాడు. రక్తం కారుతూ పట్టా కత్తితో వస్తున్న అతడిని చూసి నర్సులు, వైద్య సిబ్బంది పరుగులు తీశారు. ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ వ్యక్తిని విచారణ జరిపారు. పోలీసుల సమాచారం మేరకు కారైక్కుడి సమీపం ముత్తుపట్టినం ప్రాంతంలో శివపాండ్యన్, బృహదీశ్వరన్ అనే అన్నదమ్ములు వేర్వేరుగా నివశిస్తున్నారు. వారిద్దరూ తరచూ ఆస్తి కోసం గొడవపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి శివపాండ్యన్ ఇంటికి వెళ్లి ఆస్తి విషయమై బృహదీశ్వరన్ తగాదాపెట్టుకున్నారు. దీంతో ఆగ్రహించిన బృహదీశ్వరన్ కత్తితో శివపాండ్యన్‌పై దాడి చేశాడు. దీంతో శివపాండ్యన్ తలకు, మెడకు, చేతికి గాయాలయ్యాయి. ఈ దాడి చేసిన బృహదీశ్వరన్ కత్తిని అక్కడే పడేసి పారిపోయాడు. ఆ తర్వాత శివపాండ్యన్ వళ్లంతా రక్తం కారుతుండగా కత్తిని పట్టుకుని ఆసుపత్రికి వెళ్ళాడు.

మాదకద్రవ్యాల కేసు... నేరస్తుల ఖాతాలో రూ.18.03 కోట్లు స్తంభన

ప్యారీస్,అక్టోబరు8:మాదకద్రవ్యాల కేసులో నిందితులకు చెందిన రూ.18.03కోట్ల బ్యాంక్‌ఖాతాలు స్తంభింపజేసినట్లు డీజీపీ కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో...రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాలను అరికట్టేందుకు రాష్ట్రప్రభుత్వం, పోలీసు శాఖ పటిష్ఠ చర్యలు చేపట్టిందని తెలిపింది. 2022 ఆగస్టు 10వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో జరిగిన సమీక్షా సమావేశంలో మాదకద్రవ్యాల విక్రయాలను పూర్తిస్థాయిలో నివారించాల్సిందిగా జిల్లా కలెక్టర్లు, సీనియర్ పోలీసు అధికారులకు ఆదేశించారు.మరోవైపు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ప్రచారాన్ని విజయవంతంగా చేస్తున్న సంస్థలకు రాష్ట్రప్రభుత్వం రూ. కోటి బహుమతి ప్రకటించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కేంద్ర దర్యాప్తు కంట్రోల్ రూమ్‌లో మాదకద్రవ్యాలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 10581 అనే టోల్‌ఫ్రీ నెంబరు కూడా అందుబాటులో ఉంచింది. ఈ నేపథ్యంలో, మాదకద్రవ్యాల విక్రయాలు, స్మగ్లింగ్‌కు సంబంధించి అరెస్టయిన వారికి సంబంధించిన 1,949 బ్యాంక్ ఖాతాల్లోని రూ.18.03 కోట్ల నగదు స్తంభింపజేసినట్లు డీజీపీ కార్యాలయం తెలిపింది.

ఎయిర్‌షోలో నిర్లక్ష్యం ... అధికారులపై కఠిన చర్యలు

● హోంశాఖ పరిశీలనలో ఇంటెలిజెన్స్ నివేదిక

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మెరీనాబీచ్‌లో ఆదివారం నిర్వహించిన ఎయిర్‌షో సందర్భంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం ఎయిర్‌షోకు సంబంధించి ఇంటెలిజెన్స్ నివేదికను హోంశాఖ ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఎయిర్‌షో జరిగిన ప్రాంతంలో లక్షలాది మంది గుమికూడిన ప్రాంతంలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టిన అధికారులు, షో ముగిసిన తర్వాత ఒకే సారి లక్షలాదిమంది గమ్యస్థానాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తే తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడతాయని తెలిసినా జనాన్ని సవ్యంగా గమ్యస్థానాలకు తరలించే ఏర్పాట్లపై దృష్టి సారించలేదు. ఈ కారణంగానే షో ముగించుకుని వెళుతున్నవారిలో ఐదుగురు ఎండవేడిమి భరించక ప్రాణాలు కోల్పోయారని స్పష్టమైంది. ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతాయని తెలిసి కూడా కొందరు అధికారులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే విషయంపై దృష్టిసారించలేదని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ నివేదికలో కూడా కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు పేర్కొన్నట్లు తెలుస్తోంది.

నకిలీ ఆభరణాలు కుదవపెట్టి రూ.కోట్లలో మోసం

● నలుగురు ఆంధ్రా మహిళల సహా ఆరుగురి అరెస్టు

అడయార్, అక్టోబరు 8: తిరువళ్ళూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని కనకమ్మసత్రం బ్యాంకులు, బంగారు దుకాణాల్లో నకిలీ నగలను కుదవ పెట్టి కోట్లాది రూపాయల మేరకు మోసం చేసినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నలుగురు మహిళల సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల కనకమ్మ సత్రంలో నకిలీ నగలను కదువపెట్టి రూ.2.15 లక్షల మోసం చేసిన కేసు వెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానిక పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టగా, మరో మోసం వెలుగులోకి వచ్చింది. 40 శాతం బంగారం కలిపిన నకిలీ ఆభరణాలను బ్యాంకులు, కుదువ షాపుల్లో తాకట్టుపెట్టి కోట్లాది రూపాయల మేర మోసం చేసినట్లు గుర్తించారు. దీనికి సంబంధించి ఏపీలోని రేణిగుంట ప్రాంతానికి చెందిన హరిత (34), తిరుత్తణి, వీకేఎన్ కండ్రికకు చెందిన రేఖ (35), మల్లారెడ్డి కండ్రికకు చెందిన తులసి (28), అన్నమయ్య జిల్లా మదనపల్లెకి చెందిన రామాంజనేయులు (50), విజయపురానికి చెందిన లత (48), పుత్తూరుకు చెందిన చంద్రశేఖర్ (39) అనే వారిని అరెస్టు చేశారు. వీరంతా కలిసి పలు గ్రామాల్లోని మహిళలకు నకిలీ బంగారు నగలు ఇచ్చి బ్యాంకులు, బంగారు దుకాణాల్లో కుదువపెట్టి డబ్బులు తీసుకున్నట్లు వెల్లడైంది. వీరందరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

వరద నష్టం ఫిర్యాదు నెంబరుకు అదనపు కనెక్షన్లు

పెరంబూర్, అక్టోబరు 8: నగరంలో సంభవించే వరదలపై ప్రజలు ఫిర్యాదు చేసేలా '1913' అనే నెంబరును గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిచయం చేసింది. ఇళ్లలో నీరు ప్రవేశించడం, విద్యుత్ కోతలు, చెట్లు కూలడం తదితర విపత్తులపై ప్రజలు ఈ నెంబరుకు ఫిర్యాదు చేస్తే, సత్వర నివారణ చర్యలు చేపట్టేలా జీసీసీ వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో, ఈశాన్య రుతుపవనాల ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ఈ నెంబరుకు అదనంగా 150 కనెక్షన్లు అందజేశారు. అలాగే, ప్రజలు 94455551913 అనే వాట్సాప్ నెంబరు ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు.

కున్నూరులో ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, అక్టోబరు 8: నీలగిరి జిల్లా కున్నూర్‌లోని ప్రముఖ ప్రైవేటు పాఠశాలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. పాఠశాలకు ఈ నెల 14వ తేది వరకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో, ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలకు వస్తున్నారు. బాంబు బెదిరింపు విషయాన్ని పాఠశాల నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు, పోలీసు జాగిలంతో అక్కడకు చేరుకొని బాంబు బెదిరింపు ఫేక్ అని నిర్ధారించి, ఈ-మెయిల్ పంపిన వారి కోసం విచారిస్తున్నారు.

చిదంబరం ఆలయ దీక్షితులపై కేసు నమోదు

పెరంబూర్, అక్టోబరు 8: చిదంబరం నటరాజ స్వామి ఆలయ దీక్షితులపై పోలీసులు కేసు నమోదుచేశారు. సోమవారం ఆలయంలో దీక్షితులు క్రికెట్ ఆడుతుండడం వీడియో తీసిన డీపీఐ నిర్వాహకుడు ఇళయరాజాపై వారు దాడిచేశారంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఇళయరాజా ఫిర్యాదు ఆధారంగా 5 సెక్షన్ల కింద దీక్షితులపై పోలీసులు కేసు నమోదుచేశారు.

మద్యం తాగి వచ్చిన టీచర్ సస్పెన్షన్

ఐసిఎఫ్, అక్టోబరు 8: మద్యం సేవించి పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటుపడింది. కన్నియాకుమారి జిల్లా సెరుకోల్ ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న జార్జి హెన్రీ మద్యం సేవించి పాఠశాలకు వస్తున్నాడని ఫిర్యాదులందాయి. ఈ వ్యవహారంపై చేపట్టిన విచారణ చేపట్టిన అధికారులు అందజేసిన నివేదిక ఆధారంగా టీచర్ జార్జి హెన్నీని సస్పెండ్ చేస్తూ జిల్లా ప్రధాన విద్యాధికారి కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది.

ఏసీబీ అధికారికి లంచం ఇవ్వబోయిన ఎంవీఐ అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 8: అవినీతి నిరోధక విభాగం అధికారి రవికుమార్‌కు రూ.లక్ష లంచం ఇచ్చేందుకు యత్నించిన సేలం వెస్ట్ రవాణా శాఖ కార్యాలయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సదాశివం కటకటాలపాలయ్యాడు. కార్యాలయంలో తనిఖీలు చేయకుండా ఉండేందుకు, ఒకవేళ తనిఖీ చేస్తే ముందుగానే సమాచారం ఇవ్వాలని ఈ లంచం ఇవ్వబోయినట్లు తెలిసింది. ఓమలూరు చెక్‌పోస్ట్ సమీపంలోని ఓ హోటల్‌లో అధికారికి లంచం ఇచ్చేందుకు యత్నిస్తున్న సమయంలో, అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు ఎంవీఐ సదాశివంను పట్టుకున్నారు.

మాంగాడులో వలస కార్మికుడి హత్య

ప్యారీస్, అక్టోబరు 8: స్థానిక మాంగాడులో టింబర్ డిపోలో పనిచేస్తున్న వలస కార్మికుడిని దారుణంగా హతమార్చిన మరో కార్మికుడిని అరెస్ట్ చేశారు.మాంగాడు లీలావతి నగర్‌లో ప్రభాకరన్ నిర్వహిస్తున్న టిండర్ డిపోలో ఉత్తరాదికి చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనీల్‌పాండే (43), అదే దుకాణంలో పనిచేస్తున్న కుమార్ (48) సెల్‌ఫోన్, ఛార్జర్ దాచిపెట్టి సతాయించడంతో, ఆవేశం చెందిన కుమార్ ఇనుప రాడ్‌తో దాడిచేయడంతో అనిల్ అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై మాంగాడు పోలీసులు కేసు నమోదుచేసి కుమార్‌ను అరెస్ట్ చేశారు.

పైకప్పు నుంచి జారిపడి...

స్థానిక పుళల్ కారు కంపెనీలో పనిచేసిన మారిముత్తు (35) పైకప్పు పైనుంచి కిందకు జారిపడి మరణించాడు. ఈ నెల 5వ తేది వర్షం కురుస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు.

లోడు వ్యాన్ బోల్తా

● సామ్‌సంగ్ కార్మికులకు గాయాలు

ప్యారీస్, అక్టోబరు 8: కాంచీపురం జిల్లా సుంకువారిసత్రంలో లోడు వ్యాను బోల్తాపడిన ఘటనలో పది మంది సామ్‌సంగ్ కార్మికులకు గాయాలయ్యాయి. సుంకువారిసత్రం సమీపంలోని సామ్‌సంగ్ కర్మాగారం కార్మికులు రెండు వారాలుగా రిలే సమ్మెలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో, ఈ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం మంత్రులతో జరిగిన చర్చలు విఫలం కావడంతో మంగళవారం కూడా ఆందోళన నిర్వహించారు. ఇందులో పాల్గొనేందుకు కార్మికులు ఎక్కిన లోడు వ్యాను సుంకువారిసత్రం వద్ద బోల్తాపడింది. గాయపడిన కార్మికులను శ్రీపెరుంబుదూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తిరుప్పూరులో నాటుబాంబులు పేలి ముగ్గురి దుర్మరణం



పేలుడు ధాటికి ధ్వంసమైన ఇల్లు

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరులో ఓ ఇంటిలో దాచిన నాటుబాంబులు పేలి ఓ శిశువు, మహిళ సహా ముగ్గురు తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. తిరుప్పూరు కార్పొరేషన్ పరిధిలోని పెరుమానల్లూరు రోడ్డు పాండ్యన్‌నగర్ సత్యాకాలనీకి చెందిన కార్తీ తన ఇంటిలో నాటుబాంబులు తయారు చేస్తున్నారు. ఇంటిలోనే కార్మికుల చేత నాటుబాంబులు, తారాజువ్వలు తయారు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఆ ఇంటిలోని నాటు బాంబులకు నిప్పంటుకుని పేలాయి. బాంబు పేలుడుకు భవనం పాక్షికంగా కూలింది. ఆ ఇంటి చుట్టూ నివసిస్తున్న సుమారు పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద స్థలంలో తొమ్మిది నెలల పసిబిడ్డ, ఓ మహిళ మృతి చెందారు. తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమార్ అనే వ్యక్తి చికిత్స ఫలించక ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు ఆ ప్రాంతంలోని నాటుబాంబులన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు.

ఎంత మహిమో.. నీది!

గరుడోత్సవం లక్షల భక్త జనం

గజరాజులు.. భజనలు.. కోలాటాలు.. భిన్న సంప్రదాయ నృత్యాలు.. వేద పారాయణం.. గరుడ వాహనమెక్కి ఏడు కొండలవాడు ఏతెంచాడు. మెడలో మెరిసే లక్ష్మీ కాసుల హారం.. మల్లెలు, కనకాంబరాలు, చేమంతులు, మనోరంజనాలతో అల్లిన మాల.. హృదయంపై కాంతులీనే పచ్చల హారం.. తలపై వజ్ర వైఢూర్యాలు పొదిగిన కిరీటం.. తిరువేంకట నాథుడి విభవాన్ని చూసి లక్షలాది భక్తజనం పులకించిపోయారు. మంగళవారం రాత్రి మాడవీధుల్లో గరుడుడిపై విహరించిన స్వామి, ఉదయం మోహినీ రూపుడై దర్శనమిచ్చాడు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యం ఉన్న గరుడోత్సవం రోజున తిరుమల కొండ భక్తులతో కిటకిటలాడింది.

తిరుమల ఆంధ్రజ్యోతి



'బ్లాక్'.. ఓ హాలీవుడ్ మూవీకి రీమేక్

● నిర్మాత ఎస్ఆర్ ప్రభు



జీవా, ఎస్ఆర్ ప్రభు, బాలసుబ్రమణి తదితరులు

తొలిసారి ఓ రీమేక్‌ను టచ్ చేశామనీ, అదికూడా హాలీవుడ్ మూవీ అని 'బ్లాక్' చిత్ర నిర్మాత ఎస్ఆర్ ప్రభు అన్నారు. డెబ్యూ డైరెక్టర్ జి.బాలసుబ్రమణి దర్శకత్వంలో జీవా, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'బ్లాక్'. పొటెన్షియల్ స్టూడియోస్ ఎల్ఎల్‌పీ పతాకంపై ఎస్ఆర్ ప్రభు నిర్మించారు. ఈ నెల 11న విడుదల కానున్న ఈ చిత్ర బృందం నగరంలో మీడియా సమావేశం ఏర్పాటుచేసింది. హీరో జీవా మాట్లాడుతూ, 'గత 21 యేళ్ళుగా సినిమాల్లో ఉన్నాననీ, నన్ను వృద్ధుడిగా చూడొద్దు. నా తొలి పదేళ్ళలో ప్రయోగాత్మక చిత్రాలు చేశాను. ఆ కోణంలో రాబోయే చిత్రమే 'బ్లాక్'. ఇందులో తక్కువ పాత్రలే ఉంటాయి. కానీ, అభిమానులను అమితంగా ఆకర్షిస్తాయి. సూర్యకార్తీ వంటి స్టార్ హీరోలు తన వద్ద ఉన్నప్పటికీ నిర్మాత ఎస్ఆర్ ప్రభు.. ఇలాంటి బలమైన కథతో నాతో సినిమా తీసినందుకు ధన్యవాదాలు. నిర్మాత ఎస్ఆర్ ప్రభు మాట్లాడుతూ, 'ఈ సినిమా విడుదలకు ముందే.. ఇది ఆ సినిమాకు రీమేక్, ఈ సినిమాకు రీమేక్ అంటూ ప్రచారం సాగింది. ఇప్పటివరకు 20కి పైగా సినిమాలు నిర్మించాం. ఎన్ని రీమేక్ సినిమాలు వచ్చినా మన హీరోలతో ఒరిజినల్ స్టోరీలతోనే సినిమా చేయాలని భావిస్తాం.కానీ, తొలిసారి రీమేక్‌ను టచ్ చేశాం. అదీ కూడా ఒక హాలీవుడ్ మూవీని జీవా హీరోగా రీమేక్ చేశాం.ఇది ఏ హాలీవుడ్ సినిమా అనేది రిలీజ్ తర్వాత మాట్లాడుకుందాం. ఇలాటి రీమేక్‌లను కూడా ఎంతో అందంగా తీయగలమని దర్శకుడు బాలసుబ్రమణి నిరూపించారు.దర్శకుడు బాలసుబ్రమణి మాట్లాడుతూ, 'ఈ కథను చాలా మంది హీరోలకు వివరించాను.వారంతా పెద్దగా ఆసక్తి చూపలేదు జీవాకు వివరించిన తర్వాత ఒక నిర్ణయం తీసుకుని, చివరివరకు దానికే కట్టుబడివున్నారు.నాపై నమ్మకం ఉంచి ఈ అవకాశం ఇచ్చిన నిర్మాత ప్రభుకు ఎన్నటికీ రుణపడివుంటాను' అని పేర్కొన్నారు. అలాగే, గోకుల్, ఫిలోమిన్ రాజ్, వివేక్ ప్రసన్న తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు.

19కి ధనుష్ - ఐశ్వర్య విడాకుల కేసు వాయిదా



ధనుష్ - ఐశ్వర్య

హీరో ధనుష్, సినీ దర్శకురాలు ఐశ్వర్య రజనీకాంత్ విడాకుల కేసు తదుపరి విచారణ ఈ నెల 19వ తేదీకి వాయిదా పడింది. సూపర్‌స్టార్ రజనీకాంత్ పెద్ద కుమార్తె ఐశ్వర్య హీరో ధనుష్ 2004లో ప్రేమించి పెళ్ళి చేసుకున్న విషయం తెల్సిందే. వీరికి లింగా, యాత్ర అనే ఇద్దరు కుమారులున్నారు. వీరిద్దరి మధ్య మనస్పర్థల కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే వీరిద్దరు పరస్పర అంగీకారంతో విడాకులు కోరుతూ చెన్నై ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. సోమవారం చెన్నై ప్రిన్సిపల్ ఫ్యామిలీ వెల్ఫేర్ కోర్టు న్యాయమూర్తి శుభాదేవి ముందు కేసు విచారణకు రాగా, ధనుష్, ఐశ్వర్య వ్యక్తిగతంగా హాజరుకాలేదు. దీంతో కేసు తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి న్యాయమూర్తి వాయిదావేశారు. ఇదిలావుంటే వీరిద్దరూ కోర్టుకు హాజరుకాకపోవడం వెనుక కారణం ఉందని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. వీరిద్దరినీ మళ్ళీ ఒక్కటి చేసేందుకు కొందరు ప్రముఖులు ప్రయత్నిస్తున్నారనీ, ఇందులో పురోగతి కనిపించడం వల్లే వీరిద్దరు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాలేదని ప్రచారం జరుగుతుంది.



స్కిన్ షో అంగడి సరకు కాదు

● ప్రియా భవానీ శంకర్



చిత్రజ్యోతి

సినిమాల్లో స్కిన్ షో అనేది అంగట్లో సరకు కాదని, తన శరీరాన్ని గ్లామర్‌గా చూపించి తద్వారా కమర్షియలైజ్ చేసుకోనని హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ స్పష్టం చేశారు. 'మేయాద మాన్', 'కడైకుట్టి సింగం', 'మాన్‌స్టర్', 'యానై', 'పత్తుతల', 'రత్నం'తో సహా 20కి పైగా చిత్రాల్లో నటించిన ఆమె... కోలీవుడ్‌లోని మంచి ప్రతిభ కలిగిన హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. సినిమాల్లో స్కిన్ షోపై ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పందించారు. 'సినిమాల్లో నా శరీరాన్ని ఒక వస్తువుగా విక్రయించడం నాకు ఏమాత్రం ఇష్టంలేదు. శరీరాన్ని గ్లామర్‌గా చూపించి కమర్షియలైజ్ చేయను. కొంతకాలం తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే... తప్పు చేశామా? అనే భావన రాకూడదు. నెగెటివ్ రోల్స్ వచ్చినా వాటిని తిరస్కరించకుండా నటించేందుకు సిద్ధం. ఇది సినిమా. కానీ, ఫ్యాషన్ పేరుతో స్కిన్ షో చేయరాదని గట్టి నిర్ణయంతో ఉన్నాను' అని పేర్కొన్నారు.

'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు'లో అజిత్ కంపెనీ

తమిళ అగ్రహీరో అజిత్ కుమార్ నెలకొల్పిన 'వీనస్ మోటార్‌సైకిల్ టూర్స్' కంపెనీ అండమాన్‌లో నిర్వహించిన ప్రపంచ ప్రసిద్ధ హార్లీ-డేవిడ్సన్ బైక్ రేసింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటుదక్కించుకుంది. రెండేళ్ళ క్రితం ప్రారంభించిన ఈ కంపెనీ తాజాగా అండమాన్ నికోబార్ దీవుల్లో హార్లీ-డేవిడ్సన్ బైక్ రేసింగ్ పోటీలను నిర్వహించింది. 'ఐల్యాండ్ రంబెల్' అనే పేరుతో నిర్వహించిన ఈ బైక్ రేసింగ్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. భారత్, స్కాట్లాండ్, పోర్చుగల్, వియత్నాం, థాయ్‌లాండ్, అరేబియన్ ఒడిస్సీ (యూఏఈ, ఓమన్), బెస్ట్ ఆఫ్ ఆల్ప్స్ (జర్మనీ, స్విట్జర్లాండ్, ఆస్ట్రియ, ఇటాలీ) అనే దేశాలకు చెందిన మోటారిస్టులు పాల్గొన్న ఈ రేసింగ్ పోటీలకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకుంది. కాగా, వీనస్ మోటార్స్ సైకిల్ టూర్స్ కంపెనీ కేవలం బైక్ రేసింగ్ పోటీలను మాత్రమేకాకుండా ఒక్కో రకమైన రేసర్లకు ఒక్కో తరహా సాహస క్రీడా పోటీలను నిర్వహిస్తూ ప్రశంసలు అందుకుంటుంది.



హీరో అజిత్

నిర్మాత ఐసరి కె.గణేశ్ బర్త్‌డే వేడుకల్లో సినీ ప్రముఖుల సందడి

అడయార్, అక్టోబరు 8: ప్రముఖ నిర్మాత, వేల్స్ గ్రూపు విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఐసరి కె.గణేశ్ పుట్టిన రోజు వేడుకలు నగరంలో తాజాగా ఘనంగా జరిగాయి. నగరంలోని ఓ నక్షత్ర హోటల్‌లో జరిగిన ఈ వేడుకల్లో దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్ బాబు, వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్, నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి, చిత్రపరిశ్రమకు చెందిన అనేక మంది ప్రముఖులు పాల్గొని ఆయనకు బర్త్‌డే విషెస్ చెప్పారు. ఈ బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్న సినీ ప్రముఖుల్లో దర్శకులు పేరరసు, ఆర్వీ ఉదయకుమార్, ఆర్కే సెల్వమణి, గౌతం వాసుదేవ్ మేనన్, సుందర్ సి, మారి సెల్వరాజ్, విఘ్నేష్ శివన్, ఏఎల్ విజయ్ ఉండగా, సినీ నటులుల్లో రాధిక, మీన, సంగీత, ధనుష్, విజయ్ ఆంటోనీ, జీవా, ప్రభుదేవా, పార్తిబన్, విష్ణు విశాల్, ఆర్య, నిర్మాత కలైపులి ఎస్.థాను తదితరులున్నారు.



కె.గణేశ్‌ను అభినందిస్తున్న పేరరసు, ఉదయకుమార్, ఆర్కే సెల్వమణి



వినువీధిలో విన్యాసం

● ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఘనంగా వైమానిక దళ వార్షికోత్సవం



చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భారత వైమానిక దళ 93వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని తాంబరంలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో మంగళవారం అట్టహాసంగా నిర్వహించిన వాయుసేన విన్యాసాలు చూపరులకు గగుర్పాటు కలిగించాయి. ఆదివారం మెరీనాబీచ్‌లో ఎయిర్‌షో నిర్వహించడం ద్వారా పదిహేనులక్షల మంది వీక్షకులను సంపాదించుకున్న సంతోషంతో వైమానిక దళం ఉన్నతాధికారులు, పైలెట్లు, సిబ్బంది ఈ మినీ ఎయిర్‌షో కూడా ఆకాశంలో వివిధ రకాల విమానాలతో విన్యాసాలు నిర్వహించారు. ఆకాశంలో త్రివర్ణ పతాకాన్ని తలపించే మూడు రంగులతో రంగవల్లులు, బుల్లి హెలికాప్టర్లలో సాహసకృత్యాలు, మిగ్ యుద్ధ విమానాలతో విన్యాసాలు ఇలా ఆకాశంలో ఎగురుతూ చూపరులను మైమరపించాయి. తొలుత ఓటీఏలో శిక్షణ పొందుతున్న యువ సైనికులు కవాతు నిర్వహించారు. గంటకు పైగా సాగిన ఈ విన్యాసాలను వైమానికదళం ఉన్నతాధికారులు, యువ సైనికులు వీక్షించారు.



మూర్ఛిల్లిన సైనికులు...: ఇదిలా ఉండగా ఈ ఎయిర్‌షో సందర్భంగా ముగ్గురు సైనికులు ఎండవేడి భరించలేక మూర్ఛిల్లారు. సిబ్బంది వారిని సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాథమిక చికిత్స అందించారు. ఎయిర్‌షో సందర్భంగా ఓటీఏలో శిక్షణ పొందిన సైనికులు ప్రత్యేక కవాతు నిర్వహించారు. కవాతు జరుగుతున్న సమయంలో ఒకరు నేలపై పడి మూర్ఛిల్లారు. వెంటనే ఆరోగ్య సిబ్బంది ఆసుపత్రికి చేశారు. ఇదే విధంగా ఎయిర్‌షో తిలకిస్తున్న మరో ఇద్దరు సైనికులు కూడా ఎండ వేడిమి తట్టుకోలేక మూర్ఛిల్లారు. ఆదివారం మెరీనాబీచ్‌లో ఎయిర్‌షో సందర్భంగా వందలాదిమంది ఎండ వేడిమి కారణంగా మూర్ఛిల్లిన సంగతి తెలిసిందే.

'స్నో కింగ్‌డమ్'లో దసరా ధమాకా



ఐసిఎఫ్, అక్టోబరు 8: స్థానిక ఇంజంబాక్కం ఈసీఆర్ రోడ్డులో ఉన్న 'స్నో కింగ్‌డమ్' దసరా ధమాకాకు ఆహ్వానం పలుకుతోంది. ఈ విషయమై స్నో కింగ్‌డమ్ మేనేజింగ్ డైరెక్టర్ పువ్వాడి గురు ప్రసాద్ విడుదల చేసిన ప్రకటనలో.... తమ కింగ్‌డమ్‌లో కుటుంబం సహా దసరా వేడుకలు జరుపుకొనేందుకు ప్రజలను ఆహ్వానిస్తున్నారు. 8 డిగ్రీల ఉష్ణోగ్రతలో దాండియా నత్యం అందిస్తున్నామని, ఈ కార్యక్రమంలో పిల్లల నుంచి పెద్దలు, వృద్ధులు వరకు పాల్గొని సరికొత్త అనుభూతి పొందవచ్చన్నారు. ఆరోగ్య నిబంధనలు పాటిస్తూ అధునాతన హంగులతో ఏర్పాటుచేసిన ఈ ప్రత్యేక దసరా ధమాకాలో ప్రజలు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మహేంద్రా సిటీలో హృదయదినోత్సవం



హృదయాకార బెలూన్లతో సందడి చేస్తున్న కళాశాల విద్యార్థులు

చెన్నై, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్టాన్‌కొళత్తూరులోని ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్ మహీంద్రా సిటీలో సరదా కార్యకలాపాలతో ప్రపంచ హృదయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది పాల్గొని హృదయాన్ని సంరక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఆ సందర్భంగా కళాశాల విద్యార్థులు, బాలబాలికలతో జానపదనృత్యాలు, జుంబా డ్యాన్స్‌లు అంటూ వినోదభరితమైన కార్యక్రమాలను విరివిగా నిర్వహించారు.



చెన్నైలో బీజేపీ రాష్ట్ర శాఖ కార్యదర్శి కరాటే ఆర్ త్యాగరాజన్ జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలుపుతున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న అఖిలభారత రైల్వే కార్మికుల సమ్మేళనం అధ్యక్షుడు, ఎస్ఆర్ఎంయూ ప్రధాన కార్యదర్శి ఎన్.కన్నయ్య